# 30 మన సాహిత్య పోషకులు

"మీ కాలనీలో ఓ ఆదివారం నాడు బుక్ ఎగ్జిబిషన్ పెడదామనుకుంటున్నాను. అక్కడ పుస్తకాలు బాగా అమ్ముడు పోయే అవకాశాలున్నాయా ?" అని అడిగాడో బుక్ సెల్లర్ మిత్రుడు.

వెనకటికి మహమ్మద్ ప్రవక్తగారు పర్వతాన్ని కాళ్ళ వద్దకు కదలిరమ్మని ఆజ్ఞాపించేడట. అది ఈయన్ని ఖాతరు చేయకపోతే ప్రవక్తగారే పర్వతం వద్దకుపోయి తన కాళ్ళను పర్వతం వద్ద ఉంచి "చూశారా! నాతడాఖా! అని మీసం మెలేసి గడ్డం నిమురుకున్నాడట!

కరువు కాలంలో పుస్తకాలు కొని చదివేవాళ్ళు కరువైతే పైకధలోని బిజినెస్ సీక్రెట్ పసికట్టిన కొందరు కొనగలవాళ్ళు ఉన్న చోటికే పుస్తకాలు పట్టుకెళ్ళి మరీ అమ్మాలని గ్రహించేశారు. ఆ ప్రకారం చేసి మా బుక్ సెల్లర్ మిత్రుడు చాలామందికి పుస్తకాల్ని హస్త భూషణాలుగా చేసేశాడు.

"కాలనీలో వాళ్ళ సంగతేమో నాకు సరిగా తెలీదు గానీ, మా చుట్టు ప్రక్కల ఇళ్ళలో మాత్రం గ్రంథప్రియులు

జా స్తీగానే ఉన్నట్లున్నారు. నేనింతవరకూ కొన్న పుస్తకాల్లో కనీసం సగం నాకన్నాముందుగా వాళ్ళే చదివేశారు. నేనిప్పుడు చదువుదామన్నా వాటిలో కొన్నింటికి ముందు పేజీలూ, మరి కొన్నింటికి వెనుక పేజీలూ మిగల్లేదు!'' అన్నాన్నేను.

"అరువు పుస్తకాల్ని ప్రేమించేవారి వల్ల లాభం లేదండీ! కొని ప్రేమించే వారు లేరా?''

''ముందు కొనటం అంటూ జరగాలే గాని, కొన్నాక చచ్చినట్టు ప్రేమించక పొయ్యిలో పెట్టుకుంటారటయ్యా?''

"అవునవును, ఇంతకీ మీ కాలనీ వారికి ఎలాంటివి ఎక్కువ ఇష్టం?''

"ఫ్రీగా దొరికేవి ఏవయినా ఇష్టమే ననుకుంటా!''

"ఎబ్బె! అలా కుదరదు! వాళ్ళు ఇష్టపడి కొనగలవి ఎలాంటివో చెప్పండి సార్!"

''ఇష్టానిష్టములు బహు విధములు. మా ఎదురింటి వారు రోజూ గోంగూర ఇష్టంగా కొనుక్కుంటారు. ప్రక్కింటి వాళ్ళు తోటకూర ఇష్టంగా కొనుక్కుంటారు ఇహ నా సంగతంటావా! మా ఇంట్లో అందరికీ కోడికూర ఇష్టం."

ఇహ లాభంలేదనుకుని మా వాడు ఓ దణ్ణంపెట్టి వేడి వేడి కాఫీ ఒకటి సమర్పించుకుని చేతులు పట్టుకున్నాడు.

మాది పక్కా ఎన్‌జీవోల కాలనీ, ఓ వెయ్యిదాకా ఇళ్ళున్నాయి. ఆ హౌసింగ్‌బోర్డ్ కొంపలు దేనితో కట్టింది ఎవరూ కనిపెట్టలేరు. ఆ మధ్య మా రాస్కెల్ విసిరిన రబ్బరు బంతి తగిలి మా ప్రహారీగోడ ఠపీమని పడిఊరుకుంది. ఇంకో ఇంట్లో ఓ ముసలాయన గట్టిగా తుమ్మితే పైకప్పు ఎగిరిపోయిందిట.

ఓసారి నాతోటి ఎన్‌జీవో నౌకాయిన్ని బస్సుకోసం క్యూలో పడిగాపులు పడుతూండగా అడిగేను. "ఈ ఏడాదిలో మీరు పుస్తకాలకోసం ఏమాత్రం ఖర్చుపెట్టేరు ?" అని.

"మూడొందల యాభై" అన్నాడాయన.

ఆశ్చర్యపోయేన్నేను. ఇలాంటి మహానుభావులు ఇంకొందరుంటే నాబోటివాళ్ళ పుస్తకాలకు ప్రమాదాలు తగ్గుతాయిగదా అనికూడా ఆలోచించేను.

"మీకెలాంటి పుస్తకాలిష్టం ? ఏమేం కొన్నారు ?" అనడిగాను.

ఆయన ఏడుపుమొహాం పెట్టేడు. "మా ఇద్దరిపిల్లల స్కూలు పుస్తకాలకీ, ఎక్సర్‌సైజు పుస్తకాలకే మూడొందల పాతిక ఖర్చయిందండీ !" అన్నాడు.

'అవునవును. మనకన్నా పిల్లగాళ్ళే పుస్తకాలెక్కువగా చింపేస్తున్నారు. సరే! మిగతా పాతిక రూపాయల్లో ఏ యే

ప్రఖ్యాత రచయితల ఉత్తమసాహిత్యం కొని చదివేరు ?' అని మరలా ప్రశ్నించేను.

ఆయన కొంచెం ఆలోచించేడు. 'సర్వీస్ కమిషన్ పరీక్షలకా-వాల్సిన రిఫరెన్స్‌బుక్స్ కొన్నానండీ! అవి వ్రాసిన వాళ్ళూ ప్రఖ్యాత రచయితల్లాగే ఉన్నారండీ! వాళ్ళలో ఓ రచయితగాడు మరీనూ! వాడు పరీక్షలు ప్యాసయ్యేందుకు పదహారు చిట్కాలు అంటూ అద్భుతంగా రాసేడండీ!'

నేను సంతోషించేను. రచయితలను వాడు, వీడు, గాడు, గీడు అనగల స్థాయికి మన పాఠకులు ఎదగటం గర్వ కారణమే.

'మీరు టాగోర్ పుస్తకాలేమన్నా చదివేరా ?' అనడిగేను, ఈ ఓల్డ్ మాస్టర్ కనీసం ఆ ఓల్డ్ మాస్టర్ పుస్తకాలన్నా రుచిచూసి ఉండడా ? అనుకొని.

టాగోర్ పేరెత్తగానే ఆయన పులకించిపోయేడు. "అబ్బబ్బ! ఆవిడెంత అందంగా ఉంటుందండీ! నాకు అంత బాగా నచ్చిన హీరోయిన్ మరొకత్తె లేదంటే నమ్మండి. ఆ శర్మిళాటాగోర్ మొగుడు నవాబట గదండీ! మరి తన పెళ్ళాం గుడ్డలూడదీసుకుని డాన్సులు చేస్తుంటే వాడు ఆవిణ్ణి తన్నడాండీ ?' అనడిగేడు.

అడిగిన అరనిముషం తర్వాత ఏదో గుర్తుకొచ్చినట్టు 'ఇంతకీ ఆ టాగోర్ ఏం పుస్తకాలు రాసిందండీ?' అని ప్రశ్నించేడు.

'మీరింతకుముందు అడిగిన ప్రశ్నకే సమాధానంగా ఓ పుస్తకం రాసిందటలెండి' అని నేను మొహం తిప్పుకున్నాను.

'అలాగా ఆ పుస్తకం పేరేంటండీ?' అంటూ ఆయన నోట్‌బుక్ పైకితీశేడు. 'రేపు ఫస్టున జీతంరాగానే ఎలాగేనా ఓ రెండ్రూపాయలు మిగిల్చి కొనాలి' అని గొణిగేడు.

'పేరు గుర్తులేదుగానీ, ఖరీదుమాత్రం పాతిక రూపాయలని జ్ఞాపకముండీ!' అన్నాన్నేను.

'వ్ఁ' అని ఆయన చప్పరించేసేడు.

మా పక్కింటి ఎరువుపుస్తకప్రియుడోసారి నా చిరుగుల పుస్తకం వాపస్‌చేస్తూ అడిగేడు "ఈ గొప్ప గొప్ప రచయితల పుస్తకాలు చదివి, చదివి బుర్ర వేడెక్కిపోయిందండీ! మీ దగ్గరగానీ అంబాలరాముడు సిన్మా నవలుందా?" అని.

ఇవన్నీ గుర్తుకొచ్చి మా బుక్‌సెల్లర్ మిత్రుడికి సలహా ఇచ్చేను. "ఎక్సర్‌సైజు పుస్తకాలూ, స్కూలు టెక్స్టులూ, సిన్మా నావలూ, బాగా అమ్ముడయ్యేలా ఉన్నాయోయ్!" అని.

"టెక్స్టుబుక్సు అమ్మటానికి మనం ఎక్కడికీ పోనక్కర్లేదండీ! వాళ్ళే మనషాపు వెదుక్కుంటూ వస్తారు." అన్నాడతను.

"అయితే కష్టమే" అన్నాన్నేను.

క్రిందటేడాది ఇలాగే ఓ పెద్ద బుక్ సెల్లర్ బ్రహ్మాండంగా పబ్లిసిటీ ఇచ్చి మా కాలనీలో బుక్ ఎగ్జిబిషన్ పెట్టేడు. 30 శాతం కమిషన్ ఇస్తానని మైకులో కాలని అంతా తిరిగి అదరగొట్టేడు. రూపాయి పుస్తకం డెబ్భై పైసలకే అమ్మి పారేశాడు.

తీరా లెక్కలు చూసుకునేసరికి అమ్మకం అయిదొందలూ, ఖర్చులు నాలుగొందల ఎనభయ్యయిదూ అని తేలింది. ఇది జరిగాక మరే బుక్ సెల్లరూ మా కాలనీ వాళ్ళని విజ్ఞానవంతుల్ని, సాహితీ పిపాసుల్ని చేయాలని ప్రయత్నించలేదు.

ఈ సంగతికూడా మా బుక్ సెల్లర్ ఫ్రెండుకు వివరించేను.

మా వాడు దీర్ఘంగా, గాఢంగా, గూఢ గా, నిగూఢంగా ఆలోచించేడు. "మీ కాలనీలో వెయ్యి కొంపలున్నాయన్నారు గదూ! ఒక్కో కొంపాధిపతీ ఓ పది రూపాయల పుస్తకాలు కొంటే మనకు పదివేల రూపాయల బిజినెస్ అన్నమాట. పదివేలకూ మన ఏజన్సీ కమిషన్ 4 వేలన్నమాట. అందులో ఓ రెండువేల రూపాయలు మనవి కావనుకుంటే మిగతా రెండువేలూ లాభమన్నమాట." అంటూ స్వగతంలా వల్లించాడు.

"చూసోక్కండి! రేపాదివారం మీ కాలనీలో పదివేల రూపాయల పుస్తకాలు అమ్మితీరుతాను!" అని ప్రతిజ్ఞ చేశాడు. నేను నవ్వేసేను.

ఆదివారం అంతా నేను ఊళ్ళోలేను. తిరిగి వచ్చేసరికి మావాడు బుక్ ఎగ్జిబిషన్ పెట్టడం, పదివేల రూపాయల పుస్తకాలు ఒక్క రోజులో అమ్మేయటం, అందుకుగాను లోకల్ బుక్ సెల్లర్లంతా కలిసి మా వాడికి ఘన సన్మానంచేసి వాళ్ళ సంఘం ప్రెసిడెంటుగా ఎన్నుకోవటం అన్నీ జరిగిపోయేయి.

నేను షాక్ తినిపోయేను. మా కాలనీ వాసుల్ని తేలికగా అంచనావేసినందుకు చింతించాను. దేశంలో పుస్తక ప్రియుల సంఖ్య పెరిగిపోతున్నందుకు ఆనందించేను. అర్జంటుగా అప్పు తెచ్చయినా సరే నా నవల ఒకటి అచ్చేయించుకుని ఆ వచ్చే లాభాల్లో చిన్న డాబాయిల్లు వేసుకుందామని నిర్ణయించుకున్నాను.

ఆ మర్నాడు మా వాడిని కలిసి నా నిర్ణయాలు వివరించేను. 'అయినా అన్ని ఎలా అమ్మగలిగావోయ్! అసాధ్యుడా ?' అని ప్రశంసించేను.

జవాబుగా మా వాడు ఓ కరపత్రం తీసిచ్చేడు.

అందులో తను ఫలానా ఆదివారంనాడు, ఫలానా కాలనీలో ఏమేం పుస్తకాలు అమ్మబోతున్నదీ వివరించేడు.

అందులో విశేషం ఏమీలేదు. పైగా ధరలు తగ్గించనూలేదు. కమిషన్లు ఆఫర్ చేయనూలేదు.

"ఆశ్చర్యంగా ఉందే! ఎలా కొన్నారోయ్" అనడిగేను.

జవాబుగా కరపత్రం క్రింద చిన్న టైపులో అచ్చయి వున్న ఓ వాక్యం చదవమన్నాడు. చదివేను, చదివి మావాడి తెలివితేటలకు, మా కాలనీవాసుల సాహిత్యపిపాసకూ అంజలి ఘటించేను.

ఆ పేరాలో ఇలావుంది: 'మా బుక్ ఎగ్జిబిషన్‌లో కొనే ప్రతి పదిరూపాయల పుస్తకాలకూ ఓ అర లీటర్ కిరసనాయిల్ ఉచితం.'

(ఏప్రిల్ 1974)